క్లుప్తంగా

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగ యువతులు

మీర్‌పేట: నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఫాక్స్‌కాన్ కంపెనీ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాను మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు. మీర్‌పేట జిల్లెలగూడలోని శ్రీరస్తు ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఇంటర్వ్యూలకు భారీగా స్పందన లభించింది. మొత్తం 125 మంది హాజరు కాగా 83 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారని నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఇఎస్ఐ, పీఎఫ్‌తో కూడిన వేతనం, ఉచిత క్యాబ్, భోజన సదుపాయం ఉంటుందని కంపెనీ ప్రతినిధులు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన తప్పనిసరి

వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాపారావు



మాట్లాడుతున్న డాక్టర్ పాపారావు

హుడాకాంప్లెక్స్: హెచ్ఐవీ ఎయిడ్స్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాపారావు పేర్కొన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ ఎయిడ్స్ (దిశ), జిల్లా ఆరోగ్య శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం సరూర్‌నగర్ వీఎంహోం మైదానంలో రెడ్ రన్–2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణలో ప్రజలంతా కీలక పాత్ర పోషించాలన్నారు. ఎయిడ్స్‌పై తెలిసిన విషయాలను ఇతరులకు కూడా తెలియజేయాలని సూచించారు. రెడ్ రన్–2024లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, జ్ఞాపికలను, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య

పహాడీషరీఫ్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్యని జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షర్ఫుద్దీన్ హామెద్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ దాడి కాంగ్రెస్ నేతల దివాళ కోరుతనానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వమే ఈ ఘటనకు బాధ్యత వహించాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ప్రశ్నించే వారిపై దాడులు చేయడమా ? అని ప్రశ్నించారు. ఈ విషయంలో బాధ్యులను శిక్షించాలన్నారు. ఎమ్మెల్యే ఆరికపూడి గాంధీని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

సీడీపీవో శాంతిశ్రీ, ఎంపీడీవో సరిత



ఆహార పదార్థాలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కందుకూరు: ప్రతిఒక్కరూ పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో శాంతిశ్రీ, ఎంపీడీవో సరిత పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాల్లో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జాతీయ పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు తృణధాన్యాలు, పప్పుదినుసులు, ఆకుకూరలతో వివిధ రకాల వంటలు తయారు చేసి ప్రదర్శించారు. గర్భిణులకు శ్రీమంతాలు నిర్వహించారు. అనంతరం 'మాకే నామ్ ఏక్ పేడ్' పేరుతో మొక్కలు నాటారు. సీడీపీవో శాంతిశ్రీ, ఎంపీడీవో సరిత ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు, చిన్నారులు ప్రతిరోజు తీసుకోవలసిన పోషకాలు, సమతుల్య ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ పి భారతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఇందిర, సబిత, శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓటరు జాబితా ప్రదర్శన

ఆమనగల్లు: గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో శుక్రవారం ఓటరు జాబితాను ప్రదర్శించనున్నట్లు ఎంపీడీఓ కుసుమ మాధురి ఒక ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం 19న ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

తోడుగా.. నేనున్నా!

- అక్కున చేర్చుకుంటున్న నైట్‌షెల్టర్ నిర్వాహకులు
- వృద్ధులు, ఒంటరి మహిళలకు ఆసరా
- సరూర్‌నగర్‌లో అనాథలకు ఆశ్రయం



సరూర్‌నగర్‌లోని నైట్‌షెల్టర్ భవనం

హుడాకాంప్లెక్స్: కన్న బిడ్డల ఆదరణకు నోచుకోని నిరుపేద మహిళలు, తోడును కోల్పోయి ఒంటరి వితంతువులు, తల్లిదండ్రుల ఆసర లేక రోడ్డున పడ్డ ఆడబిడ్డలు,భర్త వదిలేసిన భార్యలు, మతిస్థిమితం లేని వారు, ఇలా ఒంటరి మహిళలకు సరూర్‌నగర్‌లోని నైట్‌షెల్టర్ ఫర్ హోమ్‌లెస్ పీపుల్ ఆశ్రయం కల్పిస్తుంది.ఒంటరి మహిళలకు తోడుగా ఉండి.. నేనున్నా అనే భరోసా కల్పిస్తున్నారు.అంతేకాక మూడు పూటలా భోజనం పెట్టి ఆదరిస్తూ ఓదారుస్తుంది.

నిరాశ్రయులకు ఆశ్రయం..

చివరి మజిలీలో ఏ ఆదరణ లేని వృద్ధులు, ఇతర ఒంటరి మహిళలకు ఆశ్రయం కల్పించేందుకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ 2013లో భారతి మహిళా సంఘం ఆధ్వర్యంలో సరూర్‌నగర్ చౌడీవద్ద ప్రభుత్వ భవనంలో నైట్‌షెల్టర్ ఏర్పాటు చేసింది. ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, హయత్‌నగర్, ఉప్పల్ సర్కిళ్ల పరిధిలోని ఒంటరి మహిళలకు ఆశ్రయం కల్పిస్తున్నారు. కేవలం స్వరాష్ట్రం వారే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చి సేదతీరుతున్నారు. ఈ పదేళ్లలో 300 మందికి ఆశ్రయం కల్పించింది. ప్రస్తుతం ఇక్కడ 20 మంది ఒంటరి మహిళలు ఉన్నారు. ఒకరికొకరు తోడు నీడలా ఉంటున్నారు. ఒకరి బాధను మరొకరితో పంచుకుంటూ తమ బాధలను మరిచిపోతున్నారు. గత స్మృతులను నెమరువేసుకుంటూ ఒంటరి తనాన్ని మర్చిపోతు జీవిస్తున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



ప్రస్తుతం ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. ఇందులో 20 మందికి ఆశ్రయం కల్పించే అవకాశం ఉంది. అదనంగా వచ్చిన వారిని ఆదరించలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందించి కొత్త భవనం నిర్మిస్తే మరింత మందికి ఆశ్రయం కల్పిస్తాం. ఇక్కడ ఉన్న వారికి మూడు పూటలా పోషకాహారం అందజేయడంతో పాటు దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి వైద్యసేవలతో పాటు ఉచితంగా మందులు అందజేస్తున్నాం. వినోదం కోసం టీవీ కూడా ఏర్పాటు చేశాం. యోగా శిక్షణ శిబిరాలు నిర్వహించి వారి ఆరోగ్యాన్ని కాపాడుతున్నాం.

– సాజీదా, నైట్‌షెల్టర్ హోం, నిర్వాహకురాలు



బాధ్యతలు స్వీకరిస్తున్న విఠల్‌రెడ్డి తదితరులు

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా విఠల్‌రెడ్డి

కందుకూరు: కందుకూరు లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా సురసాని విఠల్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. బుధవారం రాత్రి లయన్స్‌క్లబ్ జిల్లా మొదటి వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ లయన్ ఎస్ రాధాకృష్ణ మండల కేంద్రంలోని టంకరి రాంరెడ్డి ఫంక్షన్‌హాల్లో ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడితో పాటు సెక్రటరీగా తీగల జగదీశ్వర్‌రెడ్డి, కోశాధికారిగా కుంచకూరి వెంకటేశ్వర్లుగుప్తాతో ప్రమాణం చేయించారు. అనంతరం రాధాకృష్ణ మాట్లాడుతూ భవిష్యత్‌లో డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి జిల్లా గవర్నర్‌కానున్నారన్నారు. సభ్యులు సమిష్టిగా కృషి చేసి జిల్లాలో లయన్స్‌క్లబ్ సేవలను మరింత విస్తరించాలని కోరారు. మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ తను గవర్నర్ స్థాయికి ఎదగడానికి సహకరించిన వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన విఠల్‌రెడ్డి తనకు బాధ్యతను అప్పగించినందుకు అందరికి ధన్యవాదాలు తెలిపారు. లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ తెప్ప శ్రీనివాస్, ఐనవోలు మహేందర్‌రెడ్డి, జోన్ చైర్‌పర్సన్ జనార్ధన్‌రెడ్డి, సెక్రటరి ఇమ్మడి బుచ్చయ్య, ఆమనగల్లు క్లబ్ అధ్యక్షుడు పి.లక్ష్మారెడ్డి, జిల్లెలగూడ చార్టర్ అధ్యక్షుడు ఎస్.సుధాకర్‌రెడ్డి, జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి, మాజీ అధ్యక్షుడు తాళ్ల అంజయ్య, ఎస్.వెంకటరంగారెడ్డి, బీఆర్ రాంరెడ్డి, బైరు కొండల్‌రెడ్డి, తాళ్ల లింగం తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణి రెడ్డి

పహాడీషరీఫ్: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ అల్లూరి వాణి రెడ్డి పేర్కొన్నారు. విషజ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వాదే ముస్తఫా బస్తీలో బుధవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు డెంగీ, మలేరియా, జ్వర పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వైరల్ ఫీవర్ వ్యాపిస్తున్న దృష్ట్యా ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. జలుబు, దగ్గు ఉంటే వెంటనే ఆస్పత్రిలో చికిత్స తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇళ్లల్లో దోమలు వృద్ధి చెందకుండా వారానికి ఒకసారి డ్రై డే పాటించాలన్నారు. కొబ్బరి చిప్పలు, పాత టైర్లు ఇళ్లల్లో లేకుండా చూసుకోవాలన్నారు. మున్సిపల్ సిబ్బందిచే ఎప్పటికప్పుడు ఫాగింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ బాలమణి, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ అంకిత్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ షేక్ ఫమిదా అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

కమిషనర్‌కు రేషన్ డీలర్ల వినతి

మహేశ్వరం: రేషన్ డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ డీసీ చౌహాన్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రతీ రేషన్ డీలర్‌కు గౌరవ వేతనం ఇచ్చి,హెల్త్ కార్డులు అందజేయాలని కోరారు. దిగుమతి చేసే హమాలీ ఖర్చు ప్రభుత్వమే భరించాలన్నారు. ప్రమాదవశాత్తు రేషన్ డీలర్ మరణిస్తే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. దహన సంస్కారాలకు రూ.30వేల తక్షణ సాయం అందజేయాలన్నారు. ఈ డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని కమిషనర్ చౌహాన్ తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రమేశ్ బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి రెడ్డిమల్ల హనుమండ్లు, రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వై.భానుచందర్ గౌడ్, జిల్లా కార్యదర్శి సత్తయ్య, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యుడు వీరస్వామి, ఎండి రఫీక్, కృష్ణ గౌడ్, సందీప్ పలువురు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- సీఐ ప్రమోద్‌కుమార్
- ముగిసిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు

ఆమనగల్లు: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని సీఐ ప్రమోద్‌కుమార్ అన్నారు. ఆ ప్రోత్సాహంతో వారు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలుగుతారని చెప్పారు. రెండు రోజులుగా పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు గురువారంతో ముగిసాయి. పీడీ జ్యోతి, బాలికల ఉన్నత పాఠశాల పీడీ రిజ్వాన, వివేకా విద్యాభారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ మహమూద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో విజేతలకు సీఐ బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని చెప్పారు. పోటీలతో గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగున్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని పేర్కొన్నారు. ఏటా క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకులను సీఐ కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ సర్దార్‌నాయక్, ఎస్ఐ వెంకటేశ్, ప్రధానోపాధ్యాయుడు పాండు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న సీఐ ప్రమోద్‌కుమార్ తదితరులు

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

పహాడీషరీఫ్: నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్‌తో కలిసి కొండా విశ్వేశ్వర్ రెడ్డి గణనాథులను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండపాల నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం యువ యూత్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కపిల్ గౌడ్, శ్రీధర్ గౌడ్, మనోజ్ కుమార్, శాంత కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న భగవద్గీత గణపతి..

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి గ్రామంలో అల్లం కుమార్ గౌడ్ ప్రతిష్ఠించిన భగవద్గీత గణపతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. గణనాథుడి ఎదురుగా సెల్‌ఫోన్ల రూపంలో రెండు బాక్స్‌లను ఏర్పాటు చేసి వాటి కింద రొటేట్ మోటార్లను ఉంచాడు. ఒక బాక్స్‌పై సోషల్ మీడియా స్టిక్కర్, మరో బాక్స్‌పై భగవద్గీత స్టిక్కర్ అతికించాడు. సోషల్ మీడియా బాక్స్‌పై వెనుక భాగంలో తప్పు, భగవద్గీత బాక్స్‌పై ఒప్పు సింబల్స్‌ను ఏర్పాటు చేశాడు. ఇలా గణనాథుడి ముందు ఈ రెండు బాక్స్‌లు కంటిన్యూగా తిరిగేలా చేశాడు. ప్రతి ఏటా ఏదో ఒక కొత్త తరహాలో కుమార్ గౌడ్ గణపతిని ప్రతిష్ఠిస్తున్నాడు. గతేడాది చంద్రాయన్–3, కొబ్బరి కాయ నమూనా, ప్రకృతి గణనాథులను ప్రతిష్ఠించి చూపరులను ఆకట్టుకుంటున్నాడు.



పూజలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్



భగవద్గీత గణపతి

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి

కడ్తాల్: పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి అన్నారు. మండల పరిధి రావిచేడ్ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫైబర్‌ల మిశ్రమాలతో కూడిన ఆహారం తీసుకోవడం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వెల్లడించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం తప్పనిసరని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం లలిత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సజాత, వాణిశ్రీ, సువర్ణ, ఆశ కార్యకర్తలు జాహేద, మంజుల, అనిత పాల్గొన్నారు.

కర్కల్‌పహాడ్‌లో..

గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరళాదేవి ఆధ్వర్యంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తహీనత నిర్మూలన, పోషకాహార ప్రాధాన్యతను వివరించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యపరమైన సలహాలు ఇచ్చారు. గర్భిణులకు సీమంతం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి

తలకొండపల్లి: సమతుల్యమైన పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తిరుమల అన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మండల పరిధి రాంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహారం గురించి మహిళలు, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తిరుమల మాట్లాడుతూ.. చిన్నారులకు పోషకాహారం అందిస్తేనే సరైన ఎదుగుదల ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, అంగన్‌వాడీ టీచర్ పద్మ, లక్ష్మీ, ఉపాధ్యాయురాలు సరస్వతి, మహిళలు పాల్గొన్నారు.



తలకొండపల్లి: రాంపూర్‌లో..

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి



పహాడీషరీఫ్: రోడ్డు పనులు ప్రారంభించిన మేయర్ పారిజాత

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

మహేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితారెడ్డి పేర్కొన్నారు. గురువారం మహేశ్వరం మండల కేంద్రం, మాణిక్యమ్మగూడ గ్రామాల్లో రూ. 80 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, తండా, అనుబంధ గ్రామాల్లో ఎమ్మెల్యే నిధులతో పాటు ప్రభుత్వం నుంచి మరిన్ని నిధులు మంజూరు చేయించి పలు అభివృద్ధి పనులు చేయిస్తామన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణాలతో పాటు అంగన్‌వాడీ, డ్వాక్రా భవనాలు, పాఠశాల భవనాల నిర్మాణాలను చేపట్టనున్నట్లు చెప్పారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తను మంత్రిగా ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. జిల్లాలో మహేశ్వరం నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. నియోజకవర్గ ప్రజలు ఎవరు అధైర్యపడొద్దన్నారు. మాణిక్యమ్మగూడ గ్రామాల్లో ఆమె పర్యటించి గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వినాయక మండపాల వద్ద ఆమె గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. మహేశ్వరం ఎస్‌బీఐ బ్యాంకులోకి వెళ్లి రైతు రుణమాఫీ సమాచారం తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ ఆనందం, శివగంగ ఆలయ మాజీ డైరెక్టర్ కర్రోళ్ల చంద్రయ్య, మాజీ వైస్ ఎంపీపీ మునగపాటి స్వప్న, శివగంగ ఆలయ మాజీ చైర్మన్ మునగపాటి నవీన్, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కల యాదగిరి గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు బాలయ్య, ప్రభాకర్, మాజీ కోఆప్షన్ సభ్యులు అదిల్ అలీ, దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, లింగం, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పహాడీషరీఫ్: బడంగ్‌పేట్‌ను ఆదర్శవంతమైన కార్పొరేషన్‌గా తీర్చిదిద్దేందుకు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేస్తున్నామని మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి పేర్కొన్నారు. మామిడిపల్లి 12వ డివిజన్ రంగ నాయకులు కాలనీలో గురువారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ యాతం పవన్ కుమార్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మామిడిపల్లి, రంగ నాయకుల కాలనీలో ఎప్పటికప్పుడు సీసీ రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ల పనులు చేయించామన్నారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లాల్ సతీష్ గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.